శిల్పారామంలో సమ్మర్ క్యాంపు

కొండాపూర్, ఏప్రిల్ 15 : మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే సమ్మర్ క్యాంపు మే 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్ రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 17వ తేదీ వరకు కొనసాగే ఈ క్యాంపులో కవిత్వం, పెన్సిల్ స్కెచ్, సీ షెల్ క్రాఫ్ట్, మధుబనీ పెయింటింగ్, ట్రైబల్ పెయింటింగ్, మండల పెయింటింగ్, లిప్సన్ ఆర్ట్, స్పోకెన్ సంస్కృతి, భగవద్గీత శ్లోకా తదితర అంశాలలో ప్రత్యేక శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 8886652030, 8886652004 నంబర్లను సంప్రదించాలని కోరారు. శిక్షణ తరగతులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటాయని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 15: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఆంధ్రమహిళా సభ లిటరసీ హౌజ్‌లో ప్రోగ్రాం ఆఫీసర్ ఉద్యోగానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. లిటరసీ హౌజ్ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు లభించేందుకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించడంతో పాటు మహిళా సాధికారతను పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ, ఆపైన చదివి, అనుభవం గల మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 9849962505, 9951210441 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కుబేర టైటిల్ కాపీ కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

కాచిగూడ,ఏప్రిల్ 15: కుబేర సినిమా టైటిల్‌ను కాపీ కొట్టి సినిమా తీయడం అన్యాయమని ఫిలిం ప్రొడ్యూసర్ కర్కికొండ నరేంద్ర ఆరోపించారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తాము ఇప్పటికే కుబేర సినిమా టైటిల్‌తో తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్‌లో టైటిల్‌ను రిజిస్టర్ చేసుకుని ఘాటింగ్ పూర్తిచేసి డబ్బింగ్ దశలో ఉందన్నారు. అయితే తాజాగా వేరే వాళ్లు తాము రిజిస్టర్ చేసుకున్న కుబేర టైటిల్‌ను కాపీకొట్టి ఇటీవల సినిమా ఫస్ట్‌లుక్ పేరుతో విడుదల చేశారని ఆరోపించారు.ఆ టైటిల్ తమకే వర్తించేలా ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ చర్యలు తీసుకోవాలని ఫిలిం ప్రొడ్యూసర్ నరేంద్ర విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ సేవల కుదింపు

సిటీబ్యూరో, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ) : మండుతున్న ఎండల నేపథ్యంలో నగరంలో ఆర్టీసీ సేవలను కుదిస్తున్నట్లుగా గ్రేటర్ హైదరాబాద్ జోన్ అధికారులు వెల్లడించారు. ఈ వేసవి కాలం ముగిసే వరకు ఉదయం 5గంటల నుంచి 12గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి అర్ధరాత్రి 12గంటల వరకు బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని ఈడీ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు, సిబ్బంది ఆరోగ్యం దృష్ట్యా మధ్యాహ్నం సమయంలో సర్వీసుల రాకపోకలను తగ్గిస్తున్నట్లుగా వివరించారు. అదే సమయంలో పగటిపూట ప్రయాణికుల రద్దీ తగ్గడం, వడదెబ్బ తగిలే ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా ప్రకటనలో పేర్కొన్నారు. మారిన సర్వీసుల సమయానికి అనుగుణంగా ప్రయాణాలను మార్చుకోవాలని సూచించారు. గ్రేటర్ వ్యాప్తంగా ఈనెల 17నుంచి ఈ మార్పులు అమలులోకి వస్తాయని తెలిపారు.

18న టీఐఎఫ్ఆర్ ఆధ్వర్యంలో సెమినార్

సిటీబ్యూరో, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ) : టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ ఆధ్వర్యంలో ఈ నెల 18న జాతీయ సెమినార్ జరగనున్నది. ఈ సదస్సులో ఉమెన్ ఇన్ వైల్డ్ లైఫ్ బయాలజిస్ట్ అంశంపై, వన్యప్రాణి సంరక్షణ రంగంలో పరిశోధనలను ప్రోత్సహించడమే లక్ష్యంగా చర్చించనున్నారు. టీఐఎఫ్ఆర్ హైదరాబాద్ ఆడిటోరియంలో సాయంత్రం 4 గంటల ప్రారంభమయ్యే ఈ సదస్సులో అనితా మణి, అనూష శంకర్ ప్యానెలిస్టుగా వ్యవహరిస్తారని టీఐఎఫ్ఆర్ వర్గాలు వెల్లడించాయి.

సమన్వయంతో పనిచేయండి

సెక్టోరల్ అధికారులు పోలింగ్ స్టేషన్లను పరిశీలించాలి | వసతులపై నివేదిక ఇవ్వాలి | కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : రాబోయే పార్లమెంట్ లోకసభ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరగడంలో సెక్టోరల్ అధికారుల పాత్ర చాలా ముఖ్యమైనదని హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మలక్‌పేట, కార్వాన్, గోషామహల్ అసెంబ్లీ సెగ్మెంట్ ఏఆర్ఓ సెక్టార్ అధికారులకు నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి సెక్టోరల్ ఆఫీసర్ తనకు కేటాయించిన 10-12 పోలింగ్ స్టేషన్లను సందర్శించి పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు సక్రమంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి పోలింగ్ కేంద్రాల్లో వసతులపై మంగళవారం సాయంత్రం కల్లా నిర్దిష్టమైన నివేదిక సమర్పించాలని సెక్టోరల్ అధికారులకు సూచించారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు సమర్పించే నివేదికలను సంబంధిత అన్నేగ్జర్‌లో పంపాలని సూచించారు. సెక్టోరల్ అధికారులకు మెజిస్టీరియల్ పవర్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. మాక్‌పోల్ విషయంలో జాగ్రత్త వహించాలని మాక్‌పోల్‌కు సంబంధించిన షీట్స్‌ను బాక్స్‌లో నుంచి తీసివేసేలా చూడాలని అన్నారు. కంట్రోల్ యూనిట్‌ను సీల్ చేయాలని, పనిచేయని బీయూసీయూ,వీవీప్యాడ్స్ వాటి స్థానంలో వెంటనే రీప్లేస్ చేయాలని, అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఓ వెంకటచారి, ఏఆర్ఓలు, సెక్టోరల్ అధికారులు, ఎలక్షన్స్ సూపరింటెండెంట్ జహురుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని బొటానికల్ గార్డెన్స్‌లో ఈవీఎం నమూనాతో ఓ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేసి ఓటుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

ఏర్పాట్ల నిర్వహణపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, ఏప్రిల్15(నమస్తే తెలంగాణ): నామినేషన్ ప్రక్రియ ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో నోడల్ అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ సూచించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం మేడ్చల్ డీసీపీ నితి కపంతు, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, నోడల్ అధికారులతో కలెక్టర్ గౌతమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం లేకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. నామినేషన్ల సమయంలో అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతి ఉంటుందని కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థులు వంద మీటర్ల దూరం వరకు వాహనాలకు అనుమతి ఉంటుందని, మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. 18 నుంచి 25 వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా http://suvidha. eci.gov.in సువిధ పోర్టల్‌ను వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ స్థానాన్ని కేటాయించాలి

లేదంటే మాదిగల సత్తాచూపుతాం | తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి

మాట్లాడుతున్న తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి కన్వీనర్ కిరణ్ మాదిగ

చిక్కడపల్లి,ఏప్రిల్ 15 : మాదిగల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు మాదిగలను విస్మరిస్తుందని తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి కన్వీనర్ పోకల కిరణ్ మాదిగ అన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే సీటుతో పాటు ఒక పార్లమెంట్ స్థానాన్ని మాదిగలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాదిగ సంఘాల మహాకూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కిరణ్ మాదిగ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి నియోజకవర్గాల్లో ఏదో ఒక చోట నుంచి మాదిగలకు సీటు కేటాయించాలన్నారు. ఈ నెల 18వ తేదీ వరకు కాంగ్రెస్ పార్టీ నిర్ణయం ప్రకటించాలని లేని పక్షంలో మాదిగల సత్తా చూపుతామని హెచ్చరించారు. 17 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించడానికి మహాకూటమి నుంచి అభ్యర్థులను పోటీలో నిలబెడుతామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగతో ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదన్నారు. ఆయన మాదిగ జాతిని తాకట్టు పెట్టి బీజేపీకి మద్దతు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి మాదిగలను మోసం చేసిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే మాదిగలకు సీటు కేటాయించాలన్నారు. మహాకూటమి సమన్వయకర్త నర్సింహ, శ్రీనివాస్, రమేశ్‌కుమార్ , ప్రొఫెసర్ తిరుపతి, ప్రొఫెసర్ నతానియల్, మాదిగ సంక్షేమ సమితి అధ్యక్షుడు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సేలం(తమిళనాడు) వేదికగా జరిగిన సీనియర్ ఇంటర్-జోనల్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టు విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన బాలుర, బాలికల ఫైనల్స్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాలకు చెందిన మమత(భువనగిరి), రాణి(సుద్దపల్లి), వినయ్(బోధన్) కీలకంగా వ్యవహరించారు. టైటిల్ విజేతగా నిలిచిన తెలంగాణ బాలుర, బాలికల టీమ్‌లను రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శోభన్‌బాబు, గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి, కోచ్ మౌనిక తదితరులు అభినందించారు.

– హైదరాబాద్, ఆట ప్రతినిధి

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

మాదిగలకు నామినేటెడ్ పదవులు ఇస్తామనడం హాస్యాస్పదం | ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

కంటోన్మెంట్, ఏప్రిల్ 15: కాంగ్రెస్ పార్టీ మాదిగలను మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. సోమవారం కంటోన్మెంట్‌లోని రాయల్ లీ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ 2004 -14 మధ్య కాలంలో ఎస్సీ వర్గీకరణ హామీ ఇచ్చింది తప్ప అమలు చేయలేదన్నారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీని ఎస్సీ వర్గీకరణ కోసం ప్రైవేట్ బిల్లు పెట్టమని పలుమార్లు కలిసిన ఫలితం లేకుండా పోయిందన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నామని చెప్పిన కాంగ్రెస్ ఎంపీ, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో మాదిగలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఓటు రూపంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ పెద్దపీట వేస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ విషయంలో స్పష్టంగా లేరని దుయ్యబట్టారు. పార్లమెంట్‌లో మాదిగలకు ప్రాతినిధ్యం లేకుండా చేసిందే కాంగ్రెస్ పార్టీ అని, మాదిగలను చట్ట సభలకు వెళ్లే స్థాయి నుంచి కింది స్థాయి పదవులు ఇస్తామనడం అవమానకరమన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ, నేతలు అజిత్ కళ్యాణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలతోనే అవకాశాలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ) : పారిశ్రామిక రంగానికి అవసరమైన వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే విద్యార్థులకు ఉన్నత అవకాశాలు వస్తాయని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రామేశ్వర్ రావు అన్నారు. సోమవారం ఎస్కీలోని ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్-మెషీన్ లెర్నింగ్ ఇంజినీరింగ్ సెషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమర్జింగ్ టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులకు వృత్తి నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా పీఎంకేవీవై, స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్‌తో కలిసి కోర్సులను ఎస్కీలో అందుబాటులోకి తీసుకువచ్చామని అన్నారు. కార్యక్రమంలో ఎంవీఎస్ఆర్ఈసీ హెచ్‌వోడీ డా. కే. వేణుగోపాల్ రావు, డా. అఖిల్ ఖరే, ప్రొ. ఎస్‌జీఎస్ మూర్తి, డా. కనకదుర్గ, ఎంవీ వసుదేవరావు, సాయికిశోర్, ఏవీ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

21న వెయిట్‌లిఫ్టింగ్ రిఫరీ పరీక్ష

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ నిబంధనల ప్రకారం రిఫరీల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైంది. జాతీయ క్యాటగిరీ-2 రిఫరీ కోసం ఈ నెల 21న ఒక్‌వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్(కొత్తపేట)లో పరీక్ష నిర్వహించనున్నట్లు మేడ్చల్ మల్కాజిగిరి వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు శృతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21ఏండ్లు పైబడి ఉన్న వారు పరీక్ష రాసేందుకు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కార్మికులను విస్మరిస్తున్న కాంగ్రెస్ సర్కార్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్

చిక్కడపల్లి,ఏప్రిల్ 15: కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్నాయని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ)రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కార్మికుల సత్తా చూపించే విధంగా మే డే వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని బీఆర్‌యూ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంబాబు యాదవ్ మాట్లాడారు. కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 44 చట్టాలను బీజేపీ రద్దుచేసి యజమానులకు మాత్రమే అనుకూలంగా తీసుకొచ్చిందని మండిపడ్డారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను, ఉద్యోగులకు విస్మరిస్తోందన్నారు. వాటర్ బోర్డులో బీఆర్ఎస్ ప్రభుత్వంలో మొదటి తేదీన వేతనాలు ఇచ్చేదని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఈ సమావేశంలో కనీస వేతనాల మండలి మాజీ చైర్మన్ నారాయణ, బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య తదితరులు పాల్గొన్నారు.

బలవంతంగా పనులు చేయిస్తున్నారు..

సిటీబ్యూరో, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ పరిధిలో రాంకీ సంస్థ చేయాల్సిన పారిశుధ్య పనులను ఆయా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, మెడికల్ ఆఫీసర్లు, డీఈలు బలవంతంగా జీహెచ్ఎంసీ కార్మికులు, ఉద్యోగులతో చేయిస్తున్నట్లు భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆరోపించింది. పారిశుధ్య పనుల్లో భాగంగా చెత్త సేకరణ, డంపింగ్ యార్డుకు తరలింపు నిధులు నిర్వహించాల్సిన రాంకీకి నెలకు కోట్ల రూపాయల బిల్లులు చెల్లిస్తూనే, ఆ పనులను జీహెచ్ఎంసీ ఉద్యోగులు, కార్మికులతో బలవంతంగా చేయిస్తున్నారని కమిషనర్ రొనాల్డ్‌రాస్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల ఎన్నికల విధులు నిర్వహిస్తూ చనిపోయిన కార్మికుడు పెండ్యాల కృష్ణ కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారాన్ని చెల్లించి, కుటుంబంలో ఒకరికీ ఉద్యోగం కల్పించాలని యూనియన్ నేతలు కోరారు. యూనియన్ అధ్యక్షుడు రాజేశ్వర రావు, జనరల్ సెక్రటరీ కృష్ణతో కలిసి నాయకులు నాలుగు అంశాలకు సంబంధించిన వినతులను కమిషనర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు రాజు, యాదగిరి, రూపేశ్, ధన్‌రాజ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అభ్యర్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 15: తెలంగాణ రాష్ట్రంలో 2022లో జరిగిన పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఎంపికై ఆర్డర్ కాపీలు అందని తమకు న్యాయం చేయాలని పలువురు అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భర్తీ ప్రక్రియలో ఎంపికైన సుమారు 170 మందికి ఆర్డర్ కాపీలు ఇవ్వలేదన్నారు. తమపై మోపబడిన తప్పుడు కేసుల్లో న్యాయస్థానాలు తమను నిర్దోషులుగా పేర్కొన్నందున అవగాహన లోపంతో ఆ కేసుల వివరాలను దరఖాస్తులో వెల్లడించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌బీ విచారణలో న్యాయస్థానం తీర్పు కాపీలను సమర్పించినప్పటికీ తమకు ఆర్డర్ కాపీలు ఇవ్వడం లేదని వాపోయారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ సంస్థ వార్షిక జనరల్ సమావేశాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

విద్యార్థుల ప్రతిభకు సానబెట్టాలి

గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

శామీర్‌పేట, ఏప్రిల్ 15 : దేశంలోని విశ్వవిద్యాలయాలు విద్యార్థుల ప్రతిభకు సానబెట్టి వారిని పోటీ ప్రపంచంలో విజయం సాధించేలా తీర్చి దిద్దాలని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ సూచించారు. ఇక్ఫాయ్ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఏసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ సంస్థ 98వ వార్షిక జనరల్ సమావేశం ఉపకులపతుల మూడు రోజుల జాతీయ సదస్సు లియోనియా ఓలిస్టిక్ డిస్టినేషన్‌లో సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా గవర్నర్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ దేశంలోని ఉన్నత విద్యకు సంబంధించి మార్పులు చేర్పులు చేసేందుకు కృషి చేస్తున్న ఏఐయూ సంస్థను అభినందించారు. జీరో డ్రగ్స్, జీరో కరెప్షన్స్ గల యూనివర్సిటీల ఏర్పాటుతో మంచి గుణగణాలు, నాలెడ్స్ గల ఫ్యూచర్స్ లీడర్స్ తయారు చేయడానికి దోహదపడుతాయన్నారు. ఈ సదస్సులో 38 మంది విద్యావేత్తలు కలిసి రచించిన పుస్తకం 'సస్టయనబుల్ గోల్స్' ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐయూ ప్రతినిధులు, దేశంలోని వివిధ విశ్వవిద్యాలయ ఉపకులపతులు పాల్గొన్నారు.

దత్తాక్షేత్రంలో పునః నవీన కార్యక్రమాలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ) : దిండుగల్‌లోని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలోని దత్తా క్షేత్ర పునః నవీన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఔటర్ రింగు రోడ్డుకు సమీపంలో ఉన్న ఈ క్షేత్రానికి 30 ఏళ్ల కిత్రమే సిద్ధయోగి అయినటువంటి అవధూత దత్త పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ ఏర్పాటు చేయగా.. అప్పటి నుంచి ఇక్కడి ఆలయంలో ప్రత్యేక పూజలు, యాగాలు నిర్వహిస్తున్నారు. ఈ క్షేత్రంలో ప్రతిష్ఠించిన దేవతా మూర్తులకు 12 ఏండ్లు దాటిపోయి ఉండటం వలన పునః కలశాభిషేకాలు, ఆలయ ప్రాంగణంలో ఇతర దేవతా మూర్తులకు పునః నవీన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. సోమవారం ఉదయం 11గంటల ప్రారంభమైన పాంచన్యక దీక్షతోపాటు విశేష జపాలు, హోమాలతో అంగరంగ వైభవంగా ఆలయ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరిగాయని నిర్వాహకులు తెలిపారు.